క్లుప్తంగా

దసరాకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

మదనపల్లె సిటీ : దసరా పండగ పురస్కరించుకుని ఈనెల 30, అక్టోబర్ 1వతేదీల్లో మదనపల్లె నుంచి బెంగుళూరుకు నాలుగు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. దీంతో పాటు హైదరాబాదుకు ప్రత్యేక సర్వీసు నడపనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

మంత్రికి వినతి

మదనపల్లె సిటీ : ఆర్టీసీ సంస్థలో ఖాళీగా ఉన్న కండక్టర్లు, డ్రైవర్ల పోస్టులను భర్తీ చేయాలని ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ అసోసియేషన్ నాయకులు రాజేష్‌కుమార్, వినోద్‌కుమార్ మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేశారు. స్త్రీశక్తి పథకంలో సిబ్బంది పడుతున్న ఇబ్బందులను వివరించారు. సీసీఎస్ సంస్థకు జరగుతున్న ఆర్థిక నష్టం గురించి వివరించారు.

దుస్తుల పంపిణీ



కార్మికులకు దుస్తులు అందిస్తున్న కమిషనర్ ప్రమీల

మదనపల్లె : దసరా పండగను పురస్కరించుకుని మదనపల్లె మున్సిపల్ పారిశుద్య కార్మికులకు శనివారం కమిషనర్ కే.ప్రమీల, వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి దుస్తులను పంపిణీ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 60 మందికి దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రమీల మాట్లాడుతూ కార్మికులకు దుస్తులతోపాటు సోపులు, ఆయిల్, పాదరక్షలు అందజేస్తున్నామని చెప్పారు. దీనికోసం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.14 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. డీఈ శ్రావణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య, మస్తాన్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పీలేరురూరల్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేశ్వరి అన్నారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆదివారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ కంభం సతీష్ రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజా ప్రతనిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

ఆదర్శ ఉపాధ్యాయుడు ప్రసాద్



జీవీ ప్రసాద్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు

మదనపల్లె సిటీ : వైఎస్సార్‌టీఎఫ్ వ్యవస్థాపక సభ్యులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు జీవీ ప్రసాద్ అందరికీ ఆదర్శప్రాయుడని ద్రావిడ యూనివర్శిటీ పాలకమండలి మాజీ సభ్యులు క్రిష్ణారెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలో ఎన్ఎల్ఎఫ్ పాఠశాలలో వైఎస్సార్‌సీపీ ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు గ్రహీత జీవీ ప్రసాద్, అఖిల బ్రాహ్మణ సంఘ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మునిగోటి శ్రీనివాసశర్మలకు వైఎస్సార్‌టీఎఫ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ప్రసాద్ ఉద్యోగరీత్యా పని చేసిన పాఠశాలల్లో పలు సేవా కార్యక్రమాలు చేశారని గుర్తు చేశారు. మునిగోటి శ్రీనివాస శర్మ ఉపాధ్యాయుడుగానే కాకుండా పలు సేవా కార్యక్రమాలు చేశారన్నారు. వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా కార్యదర్శి మోహన్‌రెడ్డి మాట్లాడారు. జీఆర్టీ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ కామకోటి ప్రసాదరావు, రిటైర్డు ఎంఈఓ సుధారాణి, వైఎస్సార్‌టీఎఫ్ మాజీ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచు దీప, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్‌రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె రూరల్ : ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని డీఎస్పీ కే.మహేంద్ర అన్నారు. శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ఆటో డ్రైవర్ల ప్రత్యేక సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ చట్టాలను కచ్చితంగా పాటించాలని, లేకపోతే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. రోడ్డుపై ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పాటు అతివేగంగా వాహనం నడపకూడదన్నారు. ఆటోలను ఎక్కడబడితే అక్కడ నిలబెట్టరాదన్నారు. ప్రయాణికులతో ఆటో డ్రైవర్లు మర్యాదగా ఉండాలని, భద్రంగా గమ్యం చేర్చాలన్నారు. కార్యక్రమంలో సీఐలు మహమ్మద్‌రఫీ, రాజారెడ్డి, ఎస్ఐ రహీముల్లా తదితరులు పాల్గొన్నారు.

అమ్మవు నీవే..

అఖిల జగానికి!

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాలన్నీ దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. భక్తుల క్యూలతో.. బొమ్మల కొలువులతో కళకళలాడుతున్నాయి. పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సవాలను రెట్టింపు చేస్తున్నాయి. శనివారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులను కరుణించారు. ఆ జగన్మాత దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకున్న భక్తులు నమామి మాతా నారాయణి అంటూ ప్రణమిల్లారు.

– మదనపల్లె సిటీ, రామసముద్రం,కలకడ, పీలేరు, కలికిరి, వాల్మీకిపురం




కలకడ: శాకాంబరిదేవిగా పూజలు అందుకున్న గుడిబండ శ్రీబోయకొండగంగమ్మ



రామసముద్రం మండలం మూగ ఎర్రప్పల్లిలో కరెన్సీ అలంకారంలో పటాలమ్మ అమ్మవారు



గుర్రంకొండ: చెర్లోపల్లెలో లలిత త్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చిన శ్రీ రెడ్డెమ్మతల్లి



పీలేరు రూరల్ : లలితాత్రిపుర సుందరిదేవి అలంకరణలో అంకాలమ్మ



వాల్మీకిపురం: లలితాదేవిగా పూజలు అందుకున్న లాభాలగంగమ్మ



కలికిరి: త్రిపురసుందరిదేవిగా పూజలు అందుకున్న యల్లమ్మ



బి.కొత్తకోట: శ్రీనివాసుని అలంకరణలో కన్యకాపరమేశ్వరీ



మదనపల్లె అమ్మవారిశాలలో నృత్యప్రదర్శన చేస్తున్న చిన్నారి

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి సత్కారం



మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పీలేరు : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అడ్వైజరీ కమిటీ మెంబరుగా బాధ్యతలు స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని పీలేరు వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. శనివారం మండలంలోని రేగళ్లలో మాజీ ఎమ్మెల్యేకి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తమవంతు సహకారం అందించాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు దండు జగన్‌మోహన్‌రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి సుంకర చక్రధర్, లోకనాథరెడ్డి, విక్టరీ వెంకటరమణారెడ్డి, జాకీర్, నాగరాజనాయక్, రెడ్డెప్ప, సి.వి. రావు, సి.కె. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే 'హాకథాన్'

రాయచోటి జగదాంబసెంటర్ : విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో ముందుకు రావాలని సాయి కళాశాల అధ్యాపకులు సూచించారు. శనివారం రాయచోటిలోని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హాకథాన్ – 2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు హాకథాన్ వంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. విద్యార్థుల ప్రతిభను దేశానికి పరిచయం చేయడమే కాకుండా కొత్త ఆవిష్కరణలకు దారి తీస్తుందని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణలకు కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందన్నారు. హాకథాన్‌లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా.వెంకటరమణ, సీఎస్ఈ హెచ్ఓడీ సుబహాన్, ఈసీఈ హెచ్ఓడీ కరుణాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌లో భారీ వర్షం

బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించారు. వర్షంతోపాటే మేఘాలు కమ్మేయడంతో సందర్శకులు ప్రకృతి దృశ్యాలను తిలకిస్తూ సందడి చేశారు. కాగా కొండపై చలి అధికమైంది. దీనితో రాత్రి పదిగంటలు దాకా సందర్శకులు రోడ్లపై సంచరించడం లేదు.



వర్షం పడుతున్న దృశ్యం

జీఎస్‌టీ ఆదాపై అవగాహన

బి.కొత్తకోట : జీఎస్‌టీ సంస్కరణలతో ప్రజలకు కలిగే లాభాలపై శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణానికి చెందిన దుకాణాల యజమానులు, స్థానికులతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కమిషనర్ జీవీ.పల్లవి జీఎస్‌టీ ద్వారా ఏయే విభాగాలకు ఎంత ఆదా అవుతుందనే విషయాలను వివరించారు. జీఎస్‌టీఓ శివప్రసాద్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ బాబురెడ్డినాయక్, సీనియర్ అసిస్టెంట్ గంగాధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



జీఎస్‌టీ ఆదా వివరాలను వెల్లడిస్తున్న అధికారులు



పీలేరు: ప్రసంగిస్తున్న ప్రత్యేకఅధికారి దయాకర్‌రెడ్డి

జీఎస్టీ తగ్గింపుతో తగ్గిన ధరలు

గుర్రంకొండ : జీఎస్టీ తగ్గింపుతో నిత్యావసర వస్తువుల ధరలు తగ్గాయని రాయచోటి ఎఎస్‌టీవో సతీష్‌బాబు అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో సూపర్ జీఎస్టీ– సూపర్‌సేవింగ్స్ అన్న కార్యక్రమం మీద మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎవరైనా అధిక ధరలకుగానీ పాత ధరలకుగానీ విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావ్, ఎంపీడీవో పరమేశ్వరరెడ్డి, పంచాయతీ ఈవో శ్రీహరి, పంచాయతీ కార్యదర్శులు నిస్సార్ అహ్మద్, సంధ్యారాణి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అధిక జీఎస్టీకి పాల్పడితే కేసులు తప్పవు


కలకడ : మండలంలోని ప్రతివ్యాపారి ప్రభుత్వ నిబంధనలకు లోబడి జీఎస్టీ రుసుం నమోదు చేయాలని, బిల్లులు ఇవ్వకుండా అధికశాతం జీఎస్టీ నమోదు చేసి వస్తువులు ఇస్తే వారిపై కేసులు తప్పవని మండలప్రత్యేక అధికారి దయాకర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ భానుప్రసాద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

జీఎస్‌టీ సంస్కరణలతో ప్రజలకు మేలు

మదనపల్లె రూరల్ : జీఎస్‌టీ సంస్కరణలతో ప్రజలకు ఎంతో మేలు చేకూరనుందని ఎంపీడీఓ తాజ్ మస్రూర్ అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో జీఎస్‌టీ అమలు, సంస్కరణలపై మండల మహిళా సమాఖ్య సీఆర్‌పీ, సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం ఖిజర్‌హయత్‌ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టులకు శిక్షణా తరగతులు

రాజంపేట రూరల్ : డివిజన్ పరిధిలోని వర్కింగ్ జర్నలిస్టులకు ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పల్లేటి రామసుబ్బారెడ్డి తెలియజేశారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం యూనియన్ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత 15 సంవత్సరాలుగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు జర్నలిజంపై శిక్షణా తరగతులు నిర్వహించలేదన్నారు. యూనియన్‌లకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ శిక్షణా తరగతులలో పాల్గొనవచ్చన్నారు. శిక్షణలో పాల్గొన్న జర్నలిస్టులకు సర్టిఫికెట్‌తో పాటు గైడ్‌లైన్స్‌ను తెలియజేసే పుస్తకాలను అందజేయనున్నట్లు తెలియజేశారు. తరగతుల తేదీలను త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. అలానే జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.



ఏపీయూడబ్ల్యూజే నాయకులతో మాట్లాడుతున్న రామసుబ్బారెడ్డి